కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అఖరిదానిపై 'అనంత' ఆశ..!

వైసిపి ప్రభుత్వం ఈ ఐదేళ్ల పాలనకు సంబంధించి ఆఖరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. మంగళవారం నాడు ఇంటీరియమ్ బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లలో ఉమ్మడి జిల్లాకు వనగూరిన లాభం ఏమీ పెద్దగా లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చివరి బడ్జెట్‌లోనైనా ఉమ్మడి అనంతపురం జిల్లా వైపు ప్రభుత్వం చూస్తుందా.. లేదా.? అన్నది చూడాల్సి ఉంది.

- ◆ నేడు ఇంటీరియం బడ్జెట్
- ◆ పంటనష్ట పరిహారానికి రైతుల ఎదురుచూపు
- ◆ నేటి రాష్ట్ర బడ్జెట్‌పై ఆశలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2019-20 నుంచి చూస్తే జిల్లాలో సాగునీటి రంగాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్న విమర్శలున్నాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తొలిసారి అనంతపురం నగరంలో జరిగిన పర్యటనలోనే హామీనిచ్చారు. ఈ మేరకు టెండర్లు కూడా పిలిచారు. పనులు మాత్రం ముందుకు కదల్లేదు. నిధుల కేటాయింపులూ జరగలేదు. అంతక మునుపు పెండింగ్‌లో ఉన్న పనులు కూడా ఈ ఐదేళ్లలో ముందుకు సాగలేదన్న విమర్శలున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు హంద్రీనీవా ద్వారా ఎత్తిపోతల పథకం ద్వారా కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లోని చెరువులన్నింటికీ నీటిని అందిస్తామని ప్రకటించారు. రాయదుర్గం సభలో ముఖ్యమంత్రి హోదాలోనే వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దీనిపై హామీనిచ్చారు. ఇటీవల కళ్యాణదుర్గం వచ్చినప్పుడు రూ.84 కోట్లు భూసేకరణకు నిధులు విడుదల చేశారు. అవి కూడా ఇప్పటికీ పూర్తిగా రైతులకు అందలేదు. పేరూరు ఎత్తిపోతల పథకంలో అదనంగా రెండు రిజర్వాయర్లను ఈ కాలంలో పూర్తి చేస్తామని కూడా ప్రకటన ఉంది. ఇప్పటికీ భూసేకరణకు నిధులు కేటాయించలేదు. ఇక తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తిగా ఆగిపోయింది. కనీసం మరమ్మత్తులకైనా రూ.30 కోట్లు ఇవ్వాలని అధికారులు చేసిన ప్రతిపాదనలు అటకెక్కాయి. ఐదేళ్లలో బడ్జెట్ కేటాయింపుల్లేక నిర్వహణ కూడా లేకుండాపోయింది. దీంతో నీరొచ్చినప్పుడల్లా ఎక్కడ గండ్లు పడుతాయోనన్న గుబులు అందరిలోనూ నెలకొంది. కనీసం ఇంటరీయమ్ బడ్జెట్‌లోనైనా వీటి ప్రస్తావన తీసుకొస్తారా.. లేదా.. అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు.

పరిహారం కోసం రైతుల ఎదురుచూపు

2023 సంవత్సరంలో వర్షాభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. పంటనష్టాన్ని అంచనా వేశారు. అనంతపురం జిల్లా పరిధిలో రూ.251 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ ఏడాది సంక్రాంతిలోపే ఇస్తామని ప్రకటిచారు. కానీ ఇప్పటి వరకు ప్రకటన రాలేదు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా రాష్ట్ర ప్రభుత్వం పరిహారానికి సంబంధించిన ప్రకటన ఏదైనా చేస్తుందా అని రైతులు ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా పట్టు రైతులు, రీలర్లు ఇన్‌సెంటివ్ బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. గత నెలలో రోడ్డుపై బైఠాయించి నిరసన సైతం చేపట్టారు. గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా వీరికి ఇన్సెంటీవ్ ఇవ్వలేదు. ఇవి ఇప్పుడైనా ఇవ్వాలని పట్టు రైతులు కోరుతున్నారు. వీటిపై ప్రభుత్వం ఏప్రకటన చేస్తుందోనని ఎదురు చూస్తున్నారు. ఇవే కాకుండా రహదారులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు అనేకం పెండింగులో ఉన్నాయి. వీటిల్లో ఎన్నింటికీ ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నది నేటి బడ్జెట్‌లో తేలనుంది.

మాటిచ్చి..

మోసం చేయొద్దు

- ◆ సమ్మె హామీలపై జీవోలు విడుదల చేయాలి
- ◆ మరో ఆందోళనకు వెళ్లే పరిస్థితి తేవొద్దు
- ◆ ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల హెచ్చరిక
- ◆ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం మోసం చేస్తే మరో ఆందోళనకు వెళ్లాల్సిన పరిస్థితులు వస్తాయని కార్మికులు హెచ్చరించారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నాడు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎర్రటి ఎండలో బైటాయించి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, లక్ష్మీనారాయణ, జిల్లా కోశాధికారి తిరుపాల్, టిఎస్.వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెను విరమించి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం హామీలకు సంబంధించి జీవోలు జారీ చేయడంలో తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సమ్మె ముగింపు రోజున మూడు రోజుల్లో హామీలపై జీవోలు జారీ చేస్తామని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, అధికారులు హామీనిచ్చారని గుర్తు చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న 6 వేల మంది మహిళా కార్మికులకు హెల్త్ అలవెన్స్ హామీ అమలు కాలేదన్నారు. క్లాప్ డ్రైవర్లకు చట్ట బద్ధమైన జీత భత్యాలు చెల్లింపులపై జనవరి నెలాఖరులో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ఇంతవరకు వేయలేదన్నారు. ఎన్విరాన్‌మెంట్ కార్మికులకు రూ.21 వేలు, శానిటేషన్ డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు రూ.24,500 వేతనం, విలీన గ్రామ పంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సమస్యలనూ పరిష్కరించాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ఎక్స్‌గ్రేషియా సాధారణ మృతికి రూ.2 లక్షలు, ప్రమాద మృతులకు రూ.5 నుంచి రూ. 7 లక్షలకు పెంచాలన్నారు. జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభించాలన్నారు. క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్‌కు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు తదితర జీవోలు వెంటనే జారీ చేయాలన్నారు. అధికారులకు సమస్యలను తెలిపేందుకు నిరసన తెలుపుతుంటే పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం దుర్మార్గం అన్నారు. ఇలాంటి బెదిరింపు చర్యలతో ఉద్యమాలను ఆపలేరన్న విషయాన్ని ప్రభుత్వం తెలుసుకోవాలన్నారు. అనంతరం డిఆర్ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రామయ్య, గోవిందు, నాగార్జున, రామంజి, పెద్దన్న, వెంకటేశు, దొడ్డప్ప, ఇంజినీరింగ్ కార్మిక సంఘం నాయకులు అనిల్, నాగరాజు, రమేష్, గణేష్, డ్రెయినేజీ కార్మికులు నాగరాజు, పెద్దన్న, ధర్మవరం యూనియన్ నాయకులు ముకుంద, చెన్నకేశవులు, మడకశిర యూనియన్ నాయకులు బాలు, రామంజి, మల్లేష్, శివమ్మ, యల్లమ్మ పాల్గొన్నారు.

ఒపిఎస్ పునరుద్ధరించే పార్టీకే మద్దతు: యుటిఎఫ్

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పెనుకొండ

ఒపిఎస్ పునరుద్ధరించే పార్టీకే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అన్నారు. ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్లను పట్టణంలోని డివైఇఒకార్యాలయం వద్ద యుటీ ఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన పార్టీకే ఉద్యోగ, ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని తెలిపారు. ఉద్యోగి జీవితకాలం పనిచేసి,పదవీ విరమణ తరువాత భద్రత కోసం సాధించుకున్న పెన్షన్ విధానాన్ని రద్దుచేసి, సిపిఎస్, జిపిఎస్ అంటూ భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తూ వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో ఎవరైతే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇస్తారో వారికే ఉపాధ్యాయులు ఓటు వేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈనెల 6 నుండి 15వ తేదీ వరకు పోస్ట్ కార్డు ద్వారా ఉద్యమం, 13 నుండి 29వ తేదీ వరకు గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఉద్యమం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మహిళా కమిటీ జిల్లా నాయకురాలు హసీనా బేగం, సీనియర్ నాయకులు నారాయణస్వామి, రమేష్, రవీంద్రనాథ్, ఉపేంద్ర, అశ్వర్థప్ప, లక్ష్మా నాయక్, ఆది తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి టౌన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కదిరి పట్టణంలో ఈవీఎంల భద్రతా రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలకు అవసరమయ్యే భవనాలను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో గదులను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి, సెక్యూరిటీ సిబ్బందికి అవసరమయ్యే భవనాలను పరిశీలించారు. అందుకు సంబందించి సంబందిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీవో వంశీకృష్ణ, డిఎస్‌పి శ్రీలత, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సునీతతోపాటు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భద్రపరిచేందుకు భవనాలను కలెక్టర్ అరుణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయ సమీపంలోని వ్యవసాయ గోడౌన్‌లోని భవనాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, డిఐఒ లక్ష్మన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాపై సమావేశం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజక వర్గానికి సంబంధించి తుది ఓటర్ల జాబితాపై ఆర్డీవో భాగ్యరేఖ తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవాలన్నారు. మృతిచెందిన, ఓటర్లు, డబుల్, ఎంట్రీలు, గ్రామంలో లేని ఓటర్లను గుర్తించాలన్నారు. తహశీల్దార్లు అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు వేణుగోపాల్, నాగభూషణం, కళావతి, రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, రెహమాన్, తరుణ్ తేజ్ పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నుండి బిఎస్పీ రాయుడు, జనసేన బొగ్గరం శ్రీనివాసులు, తిరుపతేంద్ర, సిపిఎం గంగాధర్, సిపిఐ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నుండి పుట్ల గంగాధర్, టిడిపి సామకోటి ఆదినారాయణ, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సౌకర్యాలు

మడకశిర : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని డాక్టర్లు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గంగలవాయి పాలెం లో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్లు ఆయేషా, అనూష, జయవర్ధన రెడ్డి, భార్గవి, హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం కింద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని గ్రామస్తు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విషాదం

ఆయనకు పోలీసు ఉద్యోగం అంటే ఎంతో ఇష్టం... కుటుంబం కంటే ఎక్కువగా తన విధులకు ప్రాధాన్యత ఇచ్చే వ్యక్తి. చిన్నప్పటి నుంచి ఎక్కడా కూడా చిన్నపాటి చెడ్డపేరు లేకుండా జీవితాన్ని గడిపారు. నిజాయితీతో పోలీసు విధులను నిర్వర్తించాడు. వృత్తి ధర్మానికి ప్రాధాన్యతను ఇస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను ఎర్రచందనం స్మగ్లర్లు పొట్టనబెట్టుకున్నారు. స్మగ్లర్ల ఆటకట్టించేందుకు వెళ్లిన ఆ పోలీసు కానిస్టేబుల్ వారి బరితెగింపుతో ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె మండలం చీనెపల్లె వద్ద మంగళవారం వేకువజామున ఎర్రచందనం స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్ ధర్మవరం పట్టణం పోతుకుంట గ్రామస్తుడు. ఈయన మృతి విషయం తెలియడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్(ఫైల్ ఫొటో)

- ◆ అన్నమయ్య జిల్లాలో ఎర్రచందనం స్మగ్లర్ల ఘాతుకం
- ◆ స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ ధర్మవరం వాసి
- ◆ మిన్నంటిన బంధువుల రోదనలు
- ◆ నేడు గుట్టకిందపల్లిలో అంత్యక్రియలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

గుట్టకిందపల్లికి చెందిన ఎపిఎస్‌పి 14వ బెటాలియన్ కానిస్టేబుల్ బి.గణేష్(40) 2013లో పోలీసు విధుల్లో చేరాడు. ప్రస్తుతం ఈయన అన్నమయ్య జిల్లా కెవి.పల్లి మండలంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కంభంవారిపల్లె మండలం చీనెపల్లె వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా అవుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 3గంటల సమయంలో సుండుపల్లె సరిహద్దు గొల్లపల్లె వద్ద పోలీసు సిబ్బంది కాపు కాశారు. ఎర్రచందనం తరలిస్తున్న వాహనం రాగానే కానిస్టేబుల్ గణేష్‌తో పాటు సిబ్బంది దానిని ఆపేందుకు యత్నించారు. స్మగ్లర్లు కారు ఆపకుండా వేగం పెంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వాహనాన్ని ఆపుదామని ప్రయత్నించిన గణేష్‌ను ఢీకొట్టారు. కారుతో వేగంగా ఢీకొట్టడంతో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు.

మంచి వ్యక్తిగా గుర్తింపు..

స్మగ్లర్ల దాడిలో మృతి చెందిన కానిస్టేబుల్ గణేష్‌కు గుట్టకిందపల్లి గ్రామంలో మంచి వ్యక్తిగా గుర్తింపు ఉంది. బిల్లే శ్రీరామలు, అలివేళమ్మ దంపతులకు ఏకైక కుమారుడు. గణేశ్ కష్టపడి 2013లో పోలీసు ఉద్యోగం సాదించాడు. 6 ఏళ్ల క్రితం తండ్రి మతిచెందాడు. అప్పటి నుంచి కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటూ అన్నీ చూసుకునేవారు. 9ఏళ్ల క్రితం రామగిరి మండలం పెనుబోలు గ్రామానికి చెందిన అనూషను వివాహం చేసుకున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు రాజకిశోర్, వేదాంత్‌లు ఉన్నారు. గ్రామంలో అందరినీ ఆప్యాయుతగా పలుకరిస్తూ, మంచి వ్యక్తిగా ఉన్న గణేశ్ స్మగర్ల చేతిలో మతిచెందడంతో గుట్టకిందపల్లిలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

నేడు అంత్యక్రియలు

స్మగర్లచేతిలో మతిచెందిన గణేశ్ మతదేహానికి బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బంధువులు తెలిపారు. ఆయన మృతదేహం మంగళవారం సాయంత్రం గ్రామానికి చేరుకుంది. బుధవారం ఉదయం ధర్మవరం పట్టణం గుట్టకిందపల్లి వద్ద పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరగనున్నాయి.

ఆసుపత్రి వద్ద రోదిస్తున్న గణేష్ కుటుంబ సభ్యులు

అంగన్వాడీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి : సిఐటియు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్

ప్రజాశక్తి -పెనుకొండ

అంగన్వాడీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీల ప్రాజెక్ట్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న రమేష్ మాట్లాడుతూ ప్రతి ప్రాజెక్టు సమావేశంలో అంగన్వాడీలకుకనీస సౌకర్యాలు కల్పించకుండా ఐసిడిఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. వారికి కనీసం తాగడానికి నీరు సౌకర్యం కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై పలుమార్లు సిడిపిఒ శాంతలక్ష్మికి వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా అంగన్వాడీ హెల్పర్స్ ప్రాజెక్టు కమిటీ ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షురాలుగా చక్రిబాయి, కార్యదర్శిగా మాలతి, రొద్దం మండలం అధ్యక్షురాలు చంద్రమ్మ, కార్యదర్శిగా కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పెదబల్లి బాబా, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యను అందించే స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి కదిరి అర్బన్

ప్రతి విద్యార్థి బాగా చదువకుని విద్యను అందించే స్థాయికి ఎదగాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంత్ కుమార్ సూచించారు. మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 40వ వార్షికోత్సవంలో ఆయనతో పాటు కమిటీ అధ్యక్షులు రెడ్డప్ప సెట్టి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ గతంలో విద్యను అభ్యసించాలంటే విద్యార్థులు అనేక కష్టాలు పడేవారన్నారు. ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు అప్పుడు లేవని అన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ పాల్గొని శరీర దృఢత్వాన్ని పెంచుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలన్నారు. ప్రతి విద్యార్థి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. చదువుతో పాటు క్రీడాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం కళాశాలలోని మెరిట్ విద్యార్థులకు ప్రిన్సిపల్ కిష్టప్ప నగదు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాటిలో ప్రతిభ కనపర్చిన వారికి రిటైర్డ్ ఉద్యోగి మల్లారెడ్డి నగదు బహుమతిని అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - హిందూపురం

ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్టు వారి ఆధ్వర్యంలో యుటిఎఫ్ హిందూపురం జోన్ వారు మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి వారి సౌజన్యంతో ఏర్పాటు చేయనున్న ఉచిత గుండె వైద్య శిబిరానికి సంబందించిన కరపత్రాలను విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి యుటిఎఫ్ నాయకులతో కలసి కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్, బాబు, మహంతి, చెన్న, మూర్తి, శంకర్, హనుమంతప్ప, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

ప్రజాశక్తి - హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా జరుగుతున్న పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సచివాలయ డిజిటల్ సెక్రటరీలకు ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్నా సచివాలయ డిజిటల్ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రామాంజి నేయులు, సెక్రటరీలు పాల్గొన్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

గోరంట్ల : పట్టణంలో ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కన్వీనర్ సోమశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి, జనసేన, బీసీ సెల్, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, తెలుగు యువత, తెలుగు రైతు, తెలుగు మహిళ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

పుట్టపర్తి రూరల్ : విద్యార్థుల ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు అవసరమని ఎంపిడిఒ నాగేశ్వరరెడ్డి సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బంది, మండలంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఇఒఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి, ఎంఇఒ ప్రసాద్ , వైద్యులు జోష్ణ, సిహెచ్ఒ నగేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ నెల 9న నిర్వహించు జాతీయాలు పురుగుల దినోత్సవం అన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం నులి పురుగు నివారణ దినోత్సవానికి సంబందించిన పోస్టర్లు విడుదల చేశారు.

బాధితుడికి పరామర్శ

కొత్తచెరువు : కొత్తచెరువు మాజీ జెడ్పీటీసీ గఫార్ కుమారుడు రఫీ ఇటీవలే గుండెపోటుకు గురై సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ బాధితుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణ, వెంకటరాముడు, చెన్నప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులకు అవగాహన

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని తిప్పేపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామ రైతు భరోసా కేంద్రంలో పశు సంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ సత్య ప్రకాష్ ఆధర్యంలో రైతులకు పశువిజ్ఞానంపై మంగళవారం అవగాహన కల్పించారు. పాడి పశువుల బీమా అవశ్యకత, గాలికుంటు వ్యాధి టీకాల ప్రాముఖ్యత, హెల్త్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమములో పశు వైద్య అధికారి ప్రవీణ్ కుమార్, పశు సంవర్ధక సహాయకులు జోష్ణ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెనుకొండ : మండల పరిధిలోని కియా ఇండస్ట్రీస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను పెనుకొండ సీఐ యుగంధర్, కియా ఇండస్ట్రీస్ ఎస్ఐ జి.రంగడు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని గుట్టూరు, మునిమడుగు, వెంకటగిరి పాళ్యం ,కురుబవాండ్లపల్లి, పంచాయతీలలోని పోలింగ్ కేంద్రాలను వారు తనిఖీ చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు

లేపాక్షి : మండలకేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఉన్నత ఓరియంటల్ పాఠశాలలో తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం జెడ్పీటీసీ నిధుల నుండి ఏర్పాటుచేసిన బోరును మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి మండల కన్వీనర్ నారాయణస్వామి, లేపాక్షి సర్పంచి ఆదినారాయణ, కాంట్రాక్ట్ నారాయణస్వామి, చలపతి, వైసిపి నాయకులు పాఠశాల, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన

లేపాక్షి : మండల కేంద్రంలో నందీశ్వర మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండలంలోని అధికారులు మహిళలకు జలజీవన్ మిషన్ పథకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రామకృష్ణ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీర్ దివ్య, సీసీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి

గోరంట్ల రూరల్ : వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మంత్రి ఉషశ్రీ చరణ్ భర్త చరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పులేరు, మరెడ్డిపల్లి, కొత్త బయన్న పల్లి, జీనం వాండ్లపల్లి గ్రామాలలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికివెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ప్రభాకర్ స్వామి, ఉప సర్పంచి శ్రీనివాసులు, జీనవాండ్లపల్లి సాయికృష్ణ, సురేష్ రెడ్డి, రాజారెడ్డి, లక్ష్మి నరసప్ప, పాలే జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు

మహిళలకు శిక్షణ

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని అమరాపురంలో ఉపాధి కల్పన, జీవనోపాదుల ఏర్పాటుపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఒకనెల రోజుల పాటు కుట్టు శిక్షణా కార్యక్రమం పూర్తిచేసుకున్న వారికి డిఆర్‌డిఎ పీడీ నరసయ్య సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

'గడపగడపకూ మన ప్రభుత్వం'

హిందూపురం : పురపాలక సంఘంలోని 12వ వార్డు పరిధిలోని మోడల్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైసిపి వేణురెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో సురక్షిత ప్రమాణాలు పాటిస్తూ బాధ్యత గా విధులు నిర్వర్తించాలని కార్మికులకు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం వివిధ డివిజన్లలో పర్యటించిన కమిషనర్ కార్మికుల సంఖ్య, వారి పనివిధాల గురించి శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికులతో మాట్లాడారు. పురపాలక పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పట్టణ సుందరీకరణ, పారిశుధ్య మెరుగులో శానిటేషన్ కార్యదర్శులు కార్మికులను సమన్వయం చేసుకుని పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు, భవన నిర్మాణరంగ కార్మికులు

భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి - ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇళ్ల స్థలాల వెంటనే కేటాయించాలని సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణరంగ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎనిమిది రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. వారి సమస్యలు పరిష్కరించేదాకా ఆందోళన ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, కేశవ, రమణ, సూరి, రవి, శ్రీనివాసులు, మహేష్, సురేంద్ర, చాంద్‌బాషా, కేశవ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల ప్రతిభ

ప్రతిభా విద్యార్థులతో సినీనటులు సుమన్, తదితరులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

విశాఖపట్నం లో ఈ నెల 3,4 తేదీల్లో నిర్వహించిన 7 వ అంతర్జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలలో కదిరి విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. కదిరికి చెందిన మాస్టర్ షాకీర్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కదిరికి చెందిన జైన్ పాఠశాల నుండి దైవిక్ 2 కాంస్య పతకాలు, శ్రీ శాంతినికేతన్ పాఠశాల నుండి మహమ్మద్ కైఫ్ 1 బంగారు పతకం, రీదా ముస్కాన్ 2 బంగారు పతకాలు, వాల్మీకి పాఠశాల నుండి గీతా 1 బంగారు, 1 సిల్వర్ పతకాన్ని దక్కించుకున్నారు. అదే విధంగా ఖాద్రీ పాఠశాల నుండి వైష్ణవి 1 బంగారు, 1 కాంస్య పతకం, సెయింట్ మేరీ పాఠశాల నుండి కృష్ణ కీర్తి 2 కాంస్య పతకాలు, సెయింట్ థామస్ పాఠశాల నుండి మహమ్మద్ ఫేహిం 1 బంగారు, 1సిల్వర్ పతకం, భవిష్య పాఠశాల నుండి 1 బంగారు. 1 కాంస్య పతకాన్ని, ఓడిసి శ్రీ విజ్ఞాన్ సీబీఎస్ఈ పాఠశాల నుండి రీహన 1 కాంస్య పతకాన్ని సాధించారు. వివిధ పాఠశాలల నుండి 9 మంది విద్యార్థిని విద్యార్థులు కట, కుమితే 17 విభాగాలలో పాల్గొనగా 7 బంగారు పతకాలను,3వెండి పతకాలను,6 కాంస్య పతకాలను మొత్తం 16 పతకాలను సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన షాకిర్‌ను సినీ హీరో సుమన్ తదితరులు అభినందించారు.

బాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ : టిడిపి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు గ్యారెంటీ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిశేసుధాకర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం పట్టణ టీడీపీ ప్రచార కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని 39వ వార్డులోని రాంనగర్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పదకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీప్, అశోక్, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు, కరెంటుఆది, జిలకర శీన, మారుతీస్వామి, కొత్తపేట ఆది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు చూపించాలి

ప్రజాశక్తి -పెనుకొండ

హిందూపురం పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎంవి.రమణ కోరారు. ఈ మేరకు వారు మంగళవారం పెనుకొండ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓ రమణకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు, నిరుపేదలైన బీసీలు, మైనార్టీలు, బాడుగ ఇళ్లలో నివాసం ఉంటూ నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు జ్యోతమ్మ, నారాయణప్ప, వెంకటేష్, సాయి, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ అధ్యక్షురాలు నసీం తాజ్, పార్వతమ్మ, సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-హిందూపురం

నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి అభిషేక్ కుమార్ ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న సెక్టారల్ అధికారులతో వారి పరిధిలో ఉన్న పోలింగ్‌కేంద్రాల్లో సౌకర్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అదే విధంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి 2024 ఓటరు జాబితా గురించి వివరించారు. అనంతరం స్థానిక అధికారులతో పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆర్‌టిసి కాలనీలో ఉన్న మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల, ఫక్రొద్దీన్ అలీ అహ్మద్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, బాపూజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, కమ్యూనిటీ హాల్ తదితర పాఠశాల్లోని పోలింగ్‌కేంద్రాలను పరిశీలించి అక్కడున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ప్రతిభా క్రీడాకారులతో సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి

ప్రతిభా క్రీడాకారులకు అభినందన

ప్రజాశక్తి - మడకశిర

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను సిడబ్ల్యూసి మెంబర్ రఘువీరారెడ్డి అభినందించారు. మండల పరిధిలోని మనూరు సచివాలయ సిబ్బంది జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో ద్వితియస్థానాన్ని సంపాదించారు. వీరిని రఘువీరారెడ్డి మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బయపరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రచయితల సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా కల్లూరు రాఘవేంద్రరావు

ప్రజాశక్తి-హిందూపురం

కల్లూరు రాఘవేంద్రరావు

రచయితల సంఘం హిందుపురం నియోజకవర్గ అధ్యక్షులుగా హిందూపురం పట్టణానికి చెందిన విశ్రాంత హెచ్‌ఎం కల్లూరు రాఘవేంద్రరావును ఎంపిక చేశారు. ఈ మేరకు ఆసంఘం జిల్లా అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కల్లూరు రాఘవేంద్రరావు శ్రీకృష్ణదేవరాయ గ్రంధమాల- హిందూపురం సాహితీ సంస్థకు మేనేజింగ్ ఎడిటర్ వ్యవహరిస్తు తెలుగు భాషాభివృద్ధికి పాటుపడుతున్నారు. దీంతో పాటు ఈయన మూడు కాళ్ల మేక (కథలసంపుడు), స్వర్గానికి దుప్పట్లు (బాలల కథల సంపుట), వింతపూవు చిలకలతోట (బాలల కథా గేయలు), పద్మ శ్రీ కల్లూరు సుబ్బరావు జీవితచరిత్ర, అముద్రితాలు తదితర రచనలు చేశారు. శంకరవిజయం (కన్నడం నుంచి అనువాదం) ఇతర రచనలు ఎక్కువగా ఉన్నాయి. మచలీపట్నం ఆంధ్రసారస్వత సమితి వారి సూత్రం, అమెరికా'నీటి కోన సాహిత్య అకాడమీ వారి నవలా పురస్కార సన్మానం, అనంతపురం లలిత కళాపరిషత్‌లో పద్మశ్రీ కల్లూరు సుబ్బరావు సాహిత్య పురస్కారాలను అందుకున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

పంట నష్టపరిహారాన్ని అందించండి : టిడిపి

ప్రజాశక్తి - మడకశిర

2023 ఖరీఫ్‌లో పంటనష్టపోయిన రైతులకు సార్వత్రిక ఎన్నికల కోడ్ విడుదల లోపు పరిహారం అందించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది శ్రీ సత్య సాయి జిల్లా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొందన్నారు. ప్రధాన పంట వేరుశనగ తో పాటు రాగి, మొక్కజొన్న ,కంది, పత్తి ,ఆముదం, పొద్దు తిరుగుడు తదితర పంటలు సాగు చేసిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

విదేశీ మద్యం స్వాధీనం

చిలమత్తూరు : కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఎఇఎస్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తనిఖీలలో భాగంగా కర్నాటక వైపు నుండి వస్తున్న కారులో చైనీస్, జపనీస్ బాషలో ఉన్న 360 ఎంఎల్ బాటిళ్లు,750 ఎంఎల్ జపనీస్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. వీటిని సీజ్ చేసి కేసు నమోదు చేసి హిందూపురం సెబ్ స్టేషన్ తరలించినట్లు సెబ్ ఎఇఎస్ సుబ్రమణ్యం, ఎస్ఐ ఇంతియాజ్ తెలిపారు.

విదేశీ మద్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

యువకుడు ఆత్మహత్య

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని వీరాంజనేయ పల్లికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన రంజిత్ కుమార్ (29) వ్యక్తిగత, కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల నిర్మించిన నూతన భవనంలో రంజిత్‌కుమార్ ప్రతిరోజు నిద్రించేవాడని అదే క్రమంలో సోమవారం రాత్రి కొత్త ఇంటి వద్ద కు వెళ్లిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పుట్టపర్తి రూరల్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ముదిగుబ్బ : మండల పరిధిలోని కొడవండ్లపల్లి సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పీసీ.రేవు గ్రామానికి చెందిన మధుసూదన్ ద్విచక్ర వాహనం లో పి.సి.రేవు నుండి బూధనాంపల్లి వైపు వెళుతుండగా, కొడవండ్లపల్లి సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంలో ఉన్న మధుసూదన్ కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వాహనం ఢీకొని చిరుతకు గాయాలు

పెనుకొండ : పట్టణ సమీపంలోని ఆర్‌టిఒ చెక్ పోస్ట్ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం గుర్తుతెలియని వాహనం చిరుతను ఢీ కొంది.ఈ ప్రమాదంలో చిరుత తీవ్రంగా గాయ పడింది. మంగళవారం రవాణా తనిఖీ కేంద్రం సమీపంలో అటవీ ప్రాంతం నుండి జాతీయ రహదారి దాటుతున్న చిరుతను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయపడిన చిరుతకు పశు వైద్యులు వైద్య చికిత్సలు చేశారు. తిరుపతి జూ పార్కు తరలించి వైద్య చికిత్సలు అందిస్తామని అటవీశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

గాయపడిన చిరుతను తరలిస్తున్న అధికారులు, సిబ్బంది

పుట్టపర్తి క్రైమ్ : పెనుకొండ ఆర్డీవో చెక్ పోస్ట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయపడిన చిరుతను పుట్టపర్తి మున్సిపాలిటీ లోని ఎనుములపల్లి లో ఉన్న కరుణ సొసైటీకి అటవీ శాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో తరలించారు. కరుణ సొసైటి సంస్థ సభ్యులు గాయపడిన చిరుతకు ప్రథమ చికిత్స అందించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ చిరుతకు గొంతు దగ్గర తీవ్రంగా గాయమైనట్లు పేర్కొన్నారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తున్నట్లు వారు తెలిపారు.

ఉల్లిగడ్డల వామికి నిప్పు

పుట్లూరు : మండలంలోని రామలింగయ్యపల్లి గ్రామానికి చెందిన టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బ్రహ్మయ్యకు చెందిన ఉల్లిగడ్డల (ఎర్రగడ్డల) వామికి గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం నిప్పు పెట్టడంతో కాలిబూడిదయ్యాయి. దీంతో దాదాపు రూ.50వేల ఆస్తి నష్టం సంభవించిందని రైతు వాపోయాడు. పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు అగాయిత్యానికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ఎర్రగడ్డల వామికి నిప్పు పెట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

అనంతపురం : శింగనమల మండలం తరిమెల గ్రామంలో సాకే రామయ్య ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి మునిరామయ్య ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం పట్టుకున్నారు. పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేసి 84 సంచుల బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2.64 ఉంటుందన్నారు. ఈమేరకు శింగనమల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో కార్యక్రమంలో అధికారులు ఎన్.రాజశేఖర్, పి.సాయిప్రసాద్, టి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీవనజ్యోతి పాఠశాల వ్యవస్థాపకురాలు మృతి

ధర్మవరం టౌన్ : పట్టణంలోని జీవన్ జ్యోతి ఇంగ్లీషు మీడియంస్కూల్ వ్యవస్థాపకురాలు మదర్ ఎలిజబెత్ (94) మృతిచెందారు. 5దశాబ్దాలుగా ఎంతోమంది విద్యార్థులకు విద్యనందించిన మదర్ ఎలిజిబిత్ మృతదేహానికి పలువురు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మిసెస్ ఝాన్సియా, ఆర్సీఎం చర్చ్ రెవరెంట్ఫాదర్ జోషఫ్, సుజాత మేడం, అధ్యాపకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలిజిబెత్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన అవసరం

పెనుకొండ : మహిళలకు చట్టాల పట్ల ప్రాథమిక అవగాహన అవసరం అని పెనుకొండ ఎజిపిఎం భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోని సమావేశ భవనంలో సిడిపిఒ శాంత లక్ష్మి అధ్యక్షత నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కర్ రెడ్డి ఆయన మాట్లాడుతూ మహిళలకు హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన బికె

పెనుకొండ : పట్టణంలోని డిఎస్‌పి కార్యాలయంలో నూతన డిఎస్‌పి బాబ్జాన్ సైదాను టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రవి శంకర్, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, కేశవయ్య, సుబ్బరాయుడు, హుజూర్ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్పీతో మాట్లాడుతున్న పార్థసారథి

నేడు పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్ ప్రారంభం

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని పట్టణ మహిళా ప్రగతి యూనిట్ పేపర్ ప్లేట్ల తయారీ యూనిట్‌ను బుధవారం ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ మహిళ ప్రగతి సమైక్య ఆధ్వర్యంలో మహిళా సంఘం మహిళలు సొంతంగా పేపర్ ప్లేట్లు తయారు చేసి జీవనో ఉపాధి పొందుటకు ఈ యూనిట్ ఉపయోగపడుతుందన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ప్రారంభించే ఈ యూనిట్‌ను ఇతర మహిళా సంఘాలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

పెనుకొండ : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాకు వెళ్లకూడదని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ ఇంటికి పోలీస్ వచ్చి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికులు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.